జీవిత యథార్థ దృశ్యాలు

# స్వేద బిందువు ఖరీదెంత?

కావేరి

విశాఖపట్నం రైలు స్టేషన్‌నుండి 'బియ్యపు బస్తాని చినవాల్తేరుకు తీసుకు వెళ్ళటానికి ఓ బండీవాణ్ణి పిలిచాను.

'ఏంటి బాబయ్యా' అంటూ బండివాడు వచ్చాడు.

'ఈ బస్తాను చినవాల్తేరుకు తీసుపోవాలి ఎంత కొస్తావ్' అని అడిగాడు.

ఆ బండీవాడు తల గోక్కుంటూ 'మూడు రూపాయిలకి వస్తా బాబయ్యా, అని అన్నాడు ఈమాట వినడంతోనే 'వద్దులే వెళ్లు' అని అన్నాను. బండీవాడు ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయినాడు. తరువాత రిక్షావాణ్ణి పిలిచాను. రిక్షావాడు 'ఏంటి బాబయ్యా' అంటూ వచ్చాడు. నేనప్పుడు 'ఏమోయ్ ఈబస్తాను చిన వాల్తేరుకు తీసుకు వెళ్లాలి' ఎంత కొస్తావో చెప్పు' అని అన్నాను.

'వస్తా బాబయ్యా. రెండు రూపాయిలు ఇప్పించండి!'

'అంతేనా! మరేమైనా మాట!'

'ఏముంది బాబయ్యా, తమకు తెలియందేముంది. ఇక్కణ్ణించి చినోల్తేరు మూడు మైళ్ళకు పైగా ఉంది. తమరే చెప్పండి.'

'మరోమాటేం లేకుండా చెప్తున్నా రూపాయి పావలాకు వస్తావా?'

'కష్టం బాబయ్యా! రోడ్డంతా సాఫీగావుంటే ఎంతకు అయినా ఫరవాలేదు. కాని రోడ్డంతా అప్పు డౌనూ. మరో పావలా ఇప్పించండి.'

'అంతకు తక్కువైతే రావన్నమాట.'

'రాలేను బాబయ్యా' అని దీనంగా అన్నాడు.

'సరేలే, గాకపోతే' అని విసుక్కుంటూ ఇంకో రిక్షావాణ్ణి పిలిచాను. రెండో రిక్షావాడు రాబోతున్నాడు. ఇంతలో ఈ రిక్షావాడే 'వస్తా బాబయ్యా' అంటూ వచ్చాడు. 'సరే' అని అన్నాను. బస్తాను తన బండీలో పెట్టుకున్నాడు. నడవటం మొదలుపెట్టాడు. కొంత దూరం నడిచాడు. తరువాత గొణగటం మొదలు పెట్టాడు 'ఆ పావలా కూడా ఇప్పించు బాబయ్యా' అని.

'అప్పుడే ప్రారంభించావ్. మీ రిక్షా వాళ్ళందరికీ ఉండే గుణమే ఇది. మొదట ఖాండిషన్‌గా ఇంత కొస్తానని మాట్లాడుకుని తరువాత నాకంతివ్వు, ఇంతివ్వు అని ప్రారంభిస్తారు. అయినా ఎంతివ్వాలో నాకు తెలియదనుకున్నావేం!'

'తమరట్లా శెలవిస్తే ఎలా బాబయ్యా!' అని దీనంగా అన్నాడు.

నడు ముందు - తరువాత చూదాం! అని విసుగ్గా అన్నాను. ఆ రిక్షావాడి నోటిలో మాట లేదు. రిక్షాను లాగుతున్నాడు. నేను కూడా రిక్షావెంట నడిచాను. అది వేసవికాలం అందులో అది మిట్ట మధ్యాహ్నం. దారి తారుమయమైంది. ఎండ నిప్పుల్ని కక్కుతోంది. తారు కరిగిపోయింది. చెప్పులు మా ఇద్దరి కాళ్ళకూ లేవు. అతని తలకు టోపీ లేదు. నాకు గొడుగూ లేదు. కాళ్ళు కాలిపోతున్నయ్. తలలు మాడిపోతున్నయ్ చెమట తల్లో పుట్టి కనురెప్పలమీదుగా కంటిలో ప్రవేశించి కళ్లను మంట పెడుతూ కిందికి బిందువులుగా జారిపోతోంది. నేనా బాధను సహించలేక పోయాను, 'అబ్బా!' అని అనుకుంటూ నడుస్తున్నాను. రిక్షావాడు అదికూడా అనుకోకుండా వంచిన తల ఎత్తకుండా లాగుతున్నాడు. వాని చేతులనుండి చెమటకారుతోంది. నా చేతులనుండి మాత్రం కారటం లేదు. నాలో నాకు తెలియకుండా విపరీతమైన అనిర్వాచ్యమైన బాధ ఏదో పుట్టింది. నేలవంక చూశాను. రెండు చెమట చారలు కనిపించి

నయ్యి. నాకు జాలివేసింది, 'ఈ రిక్షావాని జీవితం నోరులేని పశువుకంటే హీనమైపోయిందే' అని అనుకున్నాను. తరువాత కొంతసేపాగి 'రోజుకు నువ్వెంత సంపాదిస్తావు' అని అడిగాను. అతను చాలాసేపటివరకు మాట్లాడలేకపోయినాడు. తరువాత నీరసంగా 'దాని వీల్నుపట్టి' అని అన్నాడు.

అతనిస్థితి నాకప్పుడు ఆశ్చర్యాన్ని కలిగించింది. నేనుకూడా ఆయెండలో బాధపడుతూ నడుస్తూ ఉన్నాను కాబట్టి అతను పడే ఆబాధ నాకర్థమైంది. నాకిప్పుడూ వేదన కలిగింది. నా ఆవేదనలో, కందిపోయిన అతని ముఖంలోంచి కారే స్వేదం-స్వేదంగా కనిపించలేదు. గట్టు తెంచుకుని ప్రవహించే రక్తప్రవాహంగా కనిపించింది. 'వెధవ వేసవికాలం, వెధవ ఎండలు, దారిలో చెట్టయినా తగలట్లేదు' అని తిట్టాను. కాని ఎందుకు తిట్టానో నాకు తెలియదు. నేనప్పు డసమర్థుణ్ణి. నాకాక్షణంలో ఇతికర్తవ్యత లేదు. అందుకనే తిట్టాను. మానవుని సహజస్థితి ఇంతేనేమో! అని అనుకుంటాను. నా మనస్సు ఆగలేదు. అతన్ని ఎందుకు పిలిచాను. నేను పిలవకుండా ఉంటే ఆ స్టేషన్ దగ్గిర ఆ మఱ్ఱిచెట్టు నీడలో హాయిగా నిద్రపోతూ వుండేవాడేమో? కాని ఓమూల డొక్కమాడి చస్తూవుంటే నిద్ర ఎట్లా పోతూవుంటాడు. అని అనుకున్నాను.

ఒక చెట్టు కనిపించింది. ఆచెట్టు ఐశ్వర్యవంతుల్ని పరిహాసిస్తున్నట్టుగా ఉన్నది. 'ఇక్కడ కాసేపాగుదామోయ్' అని అన్నాను. అతనేమీ మాట్లాడలేదు. ఆగిపోయినాడు.

అసలు నేనెందుకు పిలవాలి. పిలవకుండా ఉంటే అతనిబాధ పడకపోయేవాడేమో! అది అసంభవము, ఎప్పుడు పేదవాడై భూమిమీద పడ్డాడో, అప్పుడే రాసిపెట్టింది విధి. అందుకని ఏంచేస్తాడు? ఇంతకంటె హీనమైన పనైనా చేయ్యాలి. పనిచేయించుకునేవాడు పనిచేసే వాని కష్టాన్ని అర్థంచేసుకుని పనికితగ్గ ప్రతిఫలాన్నిస్తే వానికష్టం పోతుంది. అయితే అతనడిగినంతా అతనికి ఇస్తే! అని అనుకుంటున్నాను. నీరసించిన గొంతుకతో, 'బాబయ్యా ఆ పావలా కూడా ఇప్పించండి' అని అతనన్నాడు.

నేనేం సమాధానం చెప్పలేక పోయాను. చెప్పటానికి నాకు నోరు రాలేదు. నేను పేదవాణ్ణి. ఆ బస్తా నాదికాదు. నా చుట్టానిది. వాళ్ళంతకన్న ఎక్కువ ఇవ్వద్దన్నారు. ఇప్పుడు కష్టాన్ని అర్థంచేసుకున్న నేను స్వతంత్రించి ఎలా 'ఆ పావలాను కూడా ఇస్తాను' అని అంటాను. వాళ్ళు నన్ను పోషిస్తున్నారు. నా ఇష్టం అక్కడ ఏంపనిచేస్తుంది? మళ్ళీ అడిగాడు 'బాబయ్యా ఆ పావలా కూడా ఇప్పించండి' అని. నేనేమీ ఇంకా ఆలోచించలేదు, 'సరే!' అన్నాను.

అతనింకా ఏమీ మాట్లాడలేదు. రిక్షాను తీసుకుని 'పదండి పోదాం' అని అన్నాడు.

'కాసేపు కూర్చో: తొందరేం; నిదానంగా వెళ్ళవచ్చుగా' కూచుంటే ఎట్లా బాబయ్యా. అవతల బేరాలు పోతయ్యి,' అని అన్నాడు.

నేనేమీ మాట్లాడలేదు. నడవటం మొదలు పెట్టాం. 'స్పెన్సరు' కనిపించింది, అక్కడ దోవచాలా ఎత్తుగా ఉంది, రిక్షావాడు లాగలేక లాగలేక లాగుతున్నాడు. నాకు అప్రయత్నంగా కళ్ళల్లోంచి నీళ్ళు కారినయ్యి, చాలా జాలికలిగింది వెనుకనుండి తోస్తామనుకున్నాను. కాని ఎవరైనా చూస్తే నవ్వుతారేమోనని సందేహించాను. జాలిపడడంమాత్రం తేలిగ్గా పడ్డాను. కాని సహాయం చెయ్యవచ్చేటప్పటికి కాసేపు వెనకాడేను. ఒకరు నవ్వుతారని ఎంతగా పనులు మానుకుంటాం? వెనకనుండి తొయ్యటం మొదలుపెట్టాను.



అతను రిక్షాను ఆపాడు. నాముఖంకేసి చూచాడు. నేనతని కందిన ముఖాన్ని చూచాను. 'ఎందుకు ఆపావు కాసేపుండి లాగుతావా?' అని అన్నాను అతను రోజుకుంటూ 'తమకెందుకు బాబయ్యా' అని నీరసంగా అన్నాడు, 'ఫరవాలేదులే' అని సాధారణంగా అన్నాను.

ఇంతలో వెనకనుండి ఓ రిక్షా పరుగులో వస్తోంది. ఆ రిక్షావాడు నాకెందుకో తమాషాగా కనుపించాడు, ముఖంకందిపోయింది. దానిమీద చెమటకారుతోంది. అది హఠాత్తుగా చూస్తే నెత్తురే కారుతోందా అన్నట్లువుంది నోట్లోంచి తెల్లగా తెమడ కారుతోంది. 'ఇదొక వింత మృగమేమో! అని అనుకున్నాను కాని అది నా భ్రాంతి, హృదయంలేని మానవుని కాఠిన్యానికి ఏర్పడ్డ వికృతాకారం. వింత మృగం మాత్రంకాదు. దాంట్లో, ఓ వ్యక్తి కూచున్నాడు. ఆతను తెల్లటి సూటును వేసుకున్నాడు 'తొందరగాతీసుకుపో' అని కటువుగా అంటున్నాడు. కాని అతని పరుగు తగ్గిపోతోంది, ఆ ఎత్తురోడ్డును ఎక్కలేక పోతున్నాడు. అతనికి కోపంవచ్చింది 'నీకు బుద్ధిలేదు? తొందరగా తీసుకు వెడతానని ఎందుకు చెప్పావు. తీసుకుపోలేకపోతే నేను రాననాలి' అని అన్నాడు.

ఆ రిక్షావాడు ధ్వనిలేకుండా 'అవ్వు' అని అన్నాడు.

నేనా పరిస్థితిని చూడలేకపోయాను. నాకతను పశువుకంటె హీనంగా ఉన్నట్లుతోచింది. పశువు లాగ లేకపోతే దారికడ్డంగా పడుతుంది. దాన్ని కొట్టినా తిట్టినా ఏం లాభం వుండదు. ఈ వ్యక్తి అలా కాదు. లాగలేకపోయినా లాగాలి. పడుకుంటే ప్రయోజనమేలేదు. అసలు ఎక్కేవాడికే బుద్ధివుండాలి. ఎక్కించుకునేవాడు ఎప్పుడూ శక్తికి మించిన మాటలే అంటాడు. కాని చేయలేడు. ఎక్కేవాడు 'నేనుడబ్బిస్తున్నా' అని అనుకుంటాడు. కాని, ఎంత కష్టపడుతున్నాడు. నేనెంతిస్తున్నాను. అని అనుకోడు. 'పేదవాని పనులన్నీ చౌకే ననుకుంటా!.

ఆ రిక్షాలో కూర్చున్న మనిషి నన్ను చూచి నవ్వాడు. నావళ్లు ఆవేశంలో మరీ మండింది. అతన్ని తందామనుకున్నాను. కాని శాంతించాను. నామనస్సాగలేదు. రోస్తూరోస్తూ ఉన్న రిక్షానువదిలి రెండడుగులుముందుకువేశాను. కాని మూడో అడుగుమాత్రం పడలేదు. ఆ అడుగును ముందుకు వేయటంకోసం చాలా ప్రయత్నం చేశాను. ఆప్రయత్నమంతా వ్యర్థమైపోయింది. ఎందుకో నాకర్థంకాలేదు. కాస్త తమాయించుకున్నాను. నేనతన్ని కొట్టరాదు. నేను పేదవాణ్ణి. లోకంలో ఈ కారణంగా అతన్ని కొట్టాను అంటే నామీద జాలిపడదు. నవ్వుతుంది, తిరిగి నన్నే తిడుతుంది. ఈ జరిగిన స్థితి నన్నావేశపరిచింది కాని లోకాన్ని ఆవేశపరచలేదు. లోకానికి పైచూపే కాని లోచూపు లేదు. వెనక్కు తిరగటం మంచిది, అని అనుకున్నాను. కాని నామనస్సు తుఫానులో వీచే గాలిలా ముందూ వెనకా పరుగెత్తింది. 'పోనీలే!' అతను ఐశ్వర్యవంతుడైతే కావచ్చు! కానీ! లోకం అతని మాటనే వినసీ. నేను మాత్రం సహించలేను. అని ముందుకు ఇంకో అడుగు వేశాను. కాని లాభంలేదు, 'మిడత ఇక కర్తవ్యత లేక అగ్నిలో దూకుతుంది. కాని లాభం!' ఏమీలేదు; అంతే నాపని. వెనక్కి తిరిగాను. ఆ క్షణంలో అమాయకుణ్ణయినా, అటూ ఇటూ తిరగటం మొదలుపెట్టా; రిక్షావాడు నన్ను చూచి 'ఏమిటి బాబయ్యా అలా తిరుగుతారు' అని అన్నాడు ఏదో తప్పుచేసినవాడిమల్లే. కళ్లు తుడుచుకుంటూ 'ఏమీలేదు' అని అన్నాను. తరువాత మామూలుగా నడిచాను.

స్పెన్సరు దాటాము, తరువాత దారంతా పల్లపుదే. స్వేచ్ఛగా రిక్షాను లాగుతున్నాడు రిక్షావాడు. సముద్రపుగాలి చల్లగా మా కష్టాన్ని మరిపిస్తూ వీస్తోంది. మాయింటికి చేరాం, అతను బస్తాను దించాడు. అతనడిగినదానికంటె ఇంకో పావలా ఎక్కువ ఇచ్చాను. అతని ముఖం వికసించింది.

'బాబయ్యా శలవు.' అన్నాడు.